# నమ్మకం

**రాంచీ దగ్గర మెస్రాలో బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీఫార్మసీ చదువుతున్నాను. అది నా అదృష్టం. ఎందుకంటే అక్కడ సీటు రావాలంటే తెలివి, కృషితోపాటు అదృష్టం కూడా జతకావాలి.**

అయితే నేను అదృష్టం మీద ఆధారపడే వాణ్ణి కాదు. Fortunes favour the brave అన్నది నాకు శిలాశాసనం. కానీ దేశంలో క్రీమ్ అనతగ్గవారుండే ఈ సంస్థలో కూడా ఎందరో విద్యార్థులు జోస్యాన్ని నమ్మడం ఆశ్చర్యం. కొంద రైతే హాబీగా హస్తసాముద్రికాన్ని అభ్యసిస్తుంటారు. వాళ్ళ ముందు చేతులు చాపి ఎందరో నిలబడు తుంటారు.

నేను వాళ్ళకు దూరంగా వుంటాను. కానీ ఒకరోజు నా మిత్రుడు నన్ను బలవంతపెట్టాడు. అప్పుడు నేను చిరాగ్గా, "భవిష్యత్తు మన చేతుల్లో వుంది. చేతల్లో వుంది! చేతిలోని గీతలకు భవి ష్యత్తుని అంటగట్టవద్దు" అన్నాను.

అప్పుడు మా కెదురుగా చతుర్వేది వున్నాడు. అతడు హస్తసాముద్రికంలో ఎంత పేరు తెచ్చు కున్నాడంటే కొందరు ప్రొఫెసర్లు కూడా అతడి ముందు చేతులు సాచి నిలబడతారు. కంప్యూ టర్ ఇంజనీరింగ్ ఫైనలియర్లో వున్నాడతడు. నా వంక అదోలా చూసి, "భవిష్యత్తు తెలుసుకో వాలని అందరికీ వుంటుంది. కానీ అది తెలు సుకుని తట్టుకోగల ధైర్యం అందరికీ వుండదు. అలాంటివాళ్ళే జోస్యాన్ని నిరసిస్తారు" అన్నాడు.

ఇది నాకు సవాలయింది. అతడి ముందు చేయి చాపాను.

చతుర్వేది పట్టి పట్టి నా అరచేతి గీతల్ని పరిశీ లించాడు. అతడి కళ్ళు పెద్దవయ్యాయి, "నువ్వు చాలా తెలివైనవాడివి. తలచుకుంటే నువ్వు సాధించలేనిది లేదు. సంగీతం, చిత్రలేఖనం, కవిత్వం అన్నీ నీకు సహజంగా వస్తాయి..." అంటూ మొదలుపెట్టి అందరికీ తెలిసినవి, తెలి యనివి కూడా అయిన ఎన్నో గొప్ప గుణాలను నేను కలిగి వున్నట్లు చెప్పాడు. అతడు చెప్పినవి చాలా వరకూ సరిపోవడం నాకాశ్చర్యమయింది. చిట్టచివర చతుర్వేది, "అన్నీ బాగానే వున్నాయి కానీ నీకు ధనయోగం లేదు. నీ జీవితమంతా డబ్బు ఇబ్బందులతోనే గడుస్తుంది" అన్నాడు.

షాక్ తిన్నాను. నాకు బాగా డబ్బు సంపాదించా లని కోరిక. మా నాన్నగారు చిన్నతనంలో డబ్బుకు ఇబ్బందిపడి ఇప్పుడు స్వయంకృషితో లక్షాధికారి అయ్యారు. కోటీశ్వరుణ్ణి కావాలని నా కోరిక. ఆ కోరికే నాకు జీవితం పట్ల ఆసక్తిని పెంచుతోంది.

చతుర్వేది అన్ని విషయాలూ సరిగ్గా చెప్పాడు. ఇదొక్కటీ తప్పతాడా? తప్పితే బాగుండును.

జోస్యం ఊహల్లోంచి పుట్టిన శాస్త్రం. చతుర్వేది కాకతాళీయంగా కొన్ని సరిగ్గా చెప్పినంత మాత్రాన జోస్యం సైన్సు అయిపోదు. అదీకాక జరిగింది చెప్పడం వేరు, జరుగబోయేది చెప్పడం వేరు. జోస్యాన్ని నమ్మకూడదు.

ఇలా ఎంత సమర్థించుకుందామన్నా నన్ను నిరుత్సాహం పట్టి కుదపడం మానలేదు. ఎన్ని కళలుంటేనేం, ఎంత సామర్థ్యం వుంటేనేం - డబ్బు లేకపోతే ఆ జీవితం వృధా! నా జీవితం వృధా అని నాకు తోచసాగింది.

మనసులో ఇలా మధనపడుతున్నా పైకి మాత్రం నేను జోస్యాన్ని నిరసిస్తూనే వున్నాను. చతుర్వేది గురించి వాకబుచేస్తూ అతడెవరికైనా తప్పు చెబితే సంతోషిస్తూ, రైటు చెబితే గాభరాపడేవాణ్ణి. కానీ నేను గాభరాపడ్డ సందర్భాలే ఎక్కువ!

ఆ తర్వాత నుంచి నేను హస్తసాముద్రికంతో అంతో ఇంతో ప్రవేశమున్న ప్రతి ఒక్కడికీ చేయి చూపించుకోసాగాను. నాలోని ఈ మార్పుకు నా మిత్రుడాశ్చర్యపడితే, "నేను జోస్యం తప్పని సైంటి ఫిక్‌గా ఋజువు చేయదల్చుకున్నాను. నాకు ఎవ రెవరు జోస్యం చెప్పారో, ఏమేమి చెప్పారో ఒక పుస్తకంలో వ్రాస్తున్నాను. చాలావరకూ పరస్పర విరుద్ధంగా వుంటున్నాయి. ప్రతి ఒక్కరూ కొన్ని రైటు చెబుతున్నారు. కొన్ని తప్పు చెబుతున్నారు" అని చెప్పాను.

జె. శ్రీరామకమల్

"అయితే మొత్తం ఎన్ని శాంపుల్స్ చూద్దామని?" అనడిగాడు మిత్రుడు.

"వెయ్యి" అన్నాను. అప్పటికింకా పది శాంపిల్సే అయ్యాయి.

"అయితే నీ ఋజువుకు చాలా కాలం పడు తుంది" అన్నాడు నా మిత్రుడు.

కానీ అంతకాలం అవసరం లేకపోయింది. ఇంటర్ కాలేజి మ్యూజిక్ పోటీలలో పాల్గొనేం దుకు ఎక్కణ్ణించో వచ్చాడు లక్ష్మణరావు. అత గాడు హస్తసాముద్రికంలో కాకలు తీరినవాడుట. అరచేతి ముద్రలు చూసి అజారుద్దీన్ ఇండియాకు కెప్టెన్ అవుతాడనీ, పీవీ నరసింహారావు భారత ప్రధాని అవుతాడనీ చెప్పాడుట.

నా మిత్రుడు, నేను లక్ష్మణరావు వద్దకు వెళ్ళాం. అతడు నా గురించి విన్నాడు. నాతో, "కొందరు మిడిమిడి జ్ఞానంతో వచ్చీరానివి చెప్పి జోస్యం పరువు తీస్తున్నారు. నేను నీకు ఖచ్చి తంగా చెప్పి జోస్యాన్ని నమ్మేలా చేస్తాను" అన్నాడు.

అతడి ముందు చేయి సాచాను. "నీలో లలిత కళల పట్ల తపన వుంది. కానీ ఒక్కటీ అబ్బదు నీకు. అయితే ఏం రెండు చేతులా ఆర్జిస్తావు. నీ ఆస్తి నీకే తెలియనంతగా పెరిగిపోతుంది" అన్నాడు లక్ష్మణరావు.

నా ఆనందం పట్టలేను. లలితకళల విషయంలో లక్ష్మణరావు తప్పు చెప్పాడని నాకు బాధగా లేదు. నా జీవితాశయం డబ్బు సంపాదించడం...

లక్ష్మణరావు నా చేయి చూడడం అయ్యాక, "జోస్యం మనిషికెంతో మేలు చేస్తుంది. దాన్ని తప్పని ఋజువు చేయడానికి పూనుకోవడం మంచి పని కాదు. నీ హస్తరేఖల్ని బట్టి చెబుతున్నాను. నీవిక జోస్యాన్ని నిరసించే ప్రయత్నం మానేస్తావు" అన్నాడు.

అతుడు వెళ్ళిపోయాక నా మిత్రుడు నవ్వి, "ఇత గాడింకా శాంపిల్ నెంబర్ పదకొండు. ఇప్పుడే శాంప్లింగ్ మానేస్తావని ఇంకో తప్పు చెప్పాడు" అన్నాడు.

"అతడు తప్ప చెప్పలేదు. నేను నా శాంప్లింగ్ డిస్కంటిన్యూ చేస్తున్నాను" అంటూ అంతవరకూ సేకరించి వ్రాసుకున్న వివరాలు కూడా చించి పారేశాను. ఆశ్చర్యపడ్డ మిత్రుడికి నేనింకేమీ చెప్ప లేదు.

జోస్యం ఎంత బలమైనదో నాకప్పుడర్థమయింది. ఒక జ్యోతిష్కుడు నాకు అప్రియమైన విశేషం చెబితే అది ఖండించడానికి మరో జ్యోతిష్కుడు అవసరం. చతుర్వేది మాటలు విని నేనెంతగా బలహీనపడ్డానంటే జోస్యాన్ని నిరసించే మిషతో నేను నాకు ప్రియమైన విశేషం మరో జ్యోతిష్కుడి ద్వారా వినాలని ప్రయత్నిస్తున్నానన్న మాట!

అది తెలిసే లక్ష్మణరావు నన్ను ట్రిక్ చేశాడా అన్న అనుమానం కూడా నాకు లేకపోలేదు.

అయితేయేం – ఇక నేను పొరపాటున కూడా ఏ జ్యోతిష్కుడి ముందూ చేయి చాపదల్చుకో లేదు. అయినా లలిత కళల్లో సహజ సామర్థ్య మున్నవాణ్ణి, రెండు చేతులా ఆర్జించబోతున్నవాణ్ణి – నాకు భవిష్యత్తు గురించి తెలుసుకోవాల్సిన అవసరమేముంది?

◇

## వర్షంలో జలకం

నిండడి చూస్తే
వరండాలో
నిండా విషాదం వ్యాపించిన
గుండెలా వుంది నింగి

చూపును మెత్తగా
చంపేస్తూ
పల్చగా వ్యాపిస్తోంది
చీకటి

గొంతు చించుకుంటున్న
వక్తృతుల్లా వురుములు–
ఆవులిస్తున్న
జ్ఞాపకాల్లా మెరుపులు

ఎన్నాళ్ళనుంచో దాచుకున్న
కన్నీళ్ళని
ఎడతెరిపి లేకుండా
వర్షిస్తోంది ఆకాశం
విష్కృమించిన రవి
ఒగిల్చిన వేడికి
ఆణువుకొక జ్వాల
ఆవహించి
విర్విరామంగా
స్నానం చేస్తోంది నేల.

—టి. చంద్రశేఖరరెడ్డి

# కవిగారి కాఫీ అవస్థ

ఇది ఎప్పటిమాట?! దాదాపు ముప్పది సంవత్సరాలక్రితం జరిగిన విషయం! భారతదేశం పొరుగింటి చైనా దురాక్రమణను తీవ్రంగా ప్రతిఘటిస్తున్న రోజులు! యుద్ధం అంటే దానితో వచ్చే కష్టాల్లో తిండిగింజల కొరత...రేషన్లు, కంట్రోళ్ళు...ఇవీ మొట్టమొదటి ప్రజలను తాకే విషయాలు. ఆ రోజుల్లో మా నాన్నగారు బొబ్బిలితాలూకా తహసీల్దారుగా పనిచేసేవారుట. పెద్దవాళ్ళు చెప్పుకోగా వినడం తప్ప నాకంటూ ఏమీ తెలియని పసితనంలో పొరాడేకాలం! ఆ రోజుల్లోనే కాఫీ త్రాగడం బాగా అలవాటుపడిన ఓ కవిద్వయం.. శ్రీ తెన్నేటి వెంకటరమణయ్యగారు, శ్రీ తెన్నేటి లక్ష్మీనరసింహంగారు ఇటు కాఫీ అలవాటు మానుకోలేక, అటు పంచదార రేషనులో దొరికీదొరక్క..బ్లాక్‌మార్కెట్‌లో కొనుక్కునే శక్తిలేక అవస్థపడుతూ...ఇక భరించలేక.. ఆ బాధను చందోబద్ధంగా కంద, సీస, గీత పద్యాల్లో వ్యక్తీకరించి...మా నాన్నగారికి దరఖాస్తు పెట్టుకున్నారుట. ఏమైనా కాన్కలిస్తామంటే మండిపడి, కాఫీ ఇస్తామంటే మాత్రం సంతోషపడే తహసీల్దారుగారు..దరఖాస్తులోని చమత్కారాన్ని గుర్తించి పంచదార లభ్యయ్యేటట్లు చూశారుట....కవికన్నా కవిత్వానికి జీవితకాలం హెచ్చు. ఆ పద్యాలను చాలా సంవత్సరాల తరువాత తమాషాగా ఉన్నాయి. పాఠకులు ఆనందిస్తారని ఆశిస్తున్నాను. ఇందులో, చీనీ అనే పదం చక్కెర, శర్కర, పంచదారలకు పర్యాయపదం, ముఖ్యంగా శ్రీకాకుళం, బొబ్బిలి ప్రాంతాలవైపు ఎక్కువగా వాడబడుతుంది.....

కం. మహారాజశ్రీ బొబ్బిలి
తహసీలుదారు వారు దయగని మాకీ
సహాయము సేయగవలయును
యహహా కాఫీలు మిగుల అలవాటయ్యెన్.

కం. బెల్లపుకాఫీ త్రాగిన
బిల్లలకుం జబ్బు హెచ్చె బెద్దలమగు మా
కెల్లను, నడుములు, కీళ్ళును
గాళ్ళుం బట్టంగ బాధకరమయ్యెప్రభో!

కం. చీనీ కంట్రోల్వచ్చిన
మానంగాలేము కాఫీ మన్నింపదగున్
మానేస్తే దలనొప్పుల
తోనే గడుపుబ్బునొప్పితో బాధ ప్రభూ!

సీ. తొలుతనే బెడ్కాఫి! తోడనే హాట్కాఫి!
పద పడింకొక కాఫి! మఱియు గాఫి!
మళ్ళీ వేరొక కాఫి! మధ్యాహ్నమొక కాఫి!
సాయంత్రమో కాఫి! సంధ్య కాఫి!
మగవారలకు కాఫి! మగువులకును కాఫి!
పిల్లలకును కాఫి! మిల్కుకాఫి!
సాధులకు స్నాఫి! సన్యాసులకు కాఫి!
బోడెమ్మలకు కాఫి! ముసలికాఫి!

తే.గీ. యెన్ని గాఫీల,నేనియు నేది తక్కు
వైన సరిపుచ్చుకోవచ్చు చీనిలేని
కాఫి త్రాగుట కష్టంబు కష్టమకట
బొబ్బిలి తాలూక ప్రభువ మా మొరలు వినుడు.

తే.గీ. చాలదయవుంచి నాల్గేసి కేజీల చీని
పంచదారను మాకు నిప్పించవలయు
బొబ్బిలి తాలూక తహశీలు ముద్రికాధి
కారి గారు మీ సరివారు వేరు లేరు.

ఆ.వె. నందబల్ల గ్రామమందుండు వారము
బ్రాహ్మణులము మేము ప్రభువువారు
రమణయ్య కవియు, లక్ష్మీనరసింహాయు
వెలయు జేసిరిట్లు విన్నపములు

కం. చీని శర్కర షుగరని
మానితమగు పేర్లు గల్గి మనుజులు కాఫీ
లోనెంతయు రుచి బెట్టెదు
దానిందయచేయవలయు తప్పక ప్రభువూ!

— తెన్నేటి వెంకటరమణయ్య, — తెన్నేటి లక్ష్మీనరసింహయ్య

— సేకరణ: డా. ప్రభా ఆత్రేయ
*Rockville, MD*

